# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-06-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పిస్తున్నామని వెల్లడించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

2. **కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్ళలో చేపట్టిన కార్యక్రమాలు దేశ ప్రగతికి దోహదపడుతున్నాయని పేర్కొన్న కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సహాయమంత్రి ఎల్. మురుగన్.**

3. **గత రెండేళ్లలో స్త్రీ, శిశు సంక్షేమ రంగాన్ని మరింత బలోపేతం చేశామని తెలిపిన మంత్రి గుమ్మిడి సంధ్యారాణి.**

4. **ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా దోహదపడుతుందన్న వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్.**

==========================

సింగపూర్ పర్యటనలో భాగంగా అంకుర సంస్థల పెట్టుబడిదారులతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సమావేశంలో సింగపూర్‌లోని భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే, రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణతో పాటు పలువురు పెట్టుబడిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, భారత్ ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోందని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పిస్తున్నామని, ఒక కుటుంబం- ఒక పారిశ్రామిక వేత్త, భూ సమీకరణ విధానాల ద్వారా పారిశ్రామిక ప్రాజెక్టులకు వేగంగా భూములు కేటాయిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందించేందుకు వెంచర్ కాపిటలిస్టులు ముందుకు రావాలని ముఖ్యమంత్రి కోరుతూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సహాయమంత్రి ఎల్. మురుగన్ తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని ఈరోజు దర్శించుకున్నారు. దర్శనం అనంతరం కేంద్ర మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. గత 12 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం వివిధ రంగాల్లో చేపట్టిన కార్యక్రమాలు దేశ ప్రగతికి దోహదపడుతున్నాయని

పేర్కొన్నారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో దేశం మరింత వేగంగా ముందుకు సాగుతోందని తెలుపుతూ,

వాయిస్..30.. సెకన్లు

-------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే రంగం గణనీయంగా అభివృద్ధి చెందుతోందని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. రాష్ట్రంలో రైల్వే ప్రగతిపై సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన ఈ రోజు స్పందిస్తూ, వందే భారత్, అమృత్ భారత్ రైళ్ల ప్రవేశం, ఆధునిక రైల్వే స్టేషన్ల అభివృద్ధి, కొత్త రైల్వే కారిడార్ల నిర్మాణం, రాజధాని అమరావతికి మెరుగైన రైల్వే అనుసంధానం వంటి కార్యక్రమాలు రాష్ట్ర రైల్వే రంగానికి కొత్త రూపునిచ్చాయని పేర్కొన్నారు. దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూస్తున్న విశాఖపట్నం రైల్వే జోన్ ఏర్పాటు కూడా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాల్లో ఒకటని తెలిపారు. నిధుల కేటాయింపులతో రైల్వే మౌలిక వసతులు బలోపేతం కావడంతో ప్రయాణికులకు మరింత వేగవంతమైన, సురక్షితమైన సేవలు అందుబాటులోకి వస్తున్నాయని కేంద్రమంత్రి తెలిపారు.

-------------------------

తుర్కియా దేశంలోని అంటాల్యాలో జరుగుతున్న ఆర్చరీ ప్రపంచకప్ మూడవ దశలో విజయవాడకు చెందిన ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్ మెన్ సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించారు. రాష్ట్రానికి చెందిన వ్యక్తి స్వర్ణ పతకాలు సాధించడం పట్ల రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం వేదికగా ఈరోజు అభినందించారు. ఇది ఆంధ్రప్రదేశ్‌కు, దేశానికి గర్వకారణమని, భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. స్వర్ణ పతకాలు గెలుచుకుని రాష్ట్ర క్రీడా రంగానికి మరింత గుర్తింపు తీసుకువచ్చారని అన్నారు. వైయస్సార్ కాంగ్రెసు పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి స్పందిస్తూ, రాబోయే సంవత్సరాల్లో మరిన్ని విజయాలు సాధించాలని పేర్కొన్నారు.

-------------------------

గత రెండేళ్లలో స్త్రీ, శిశు సంక్షేమ రంగాన్ని మరింత బలోపేతం చేశామని స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, మహిళల భద్రతకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, సమగ్ర రక్షణ, భరోసా కల్పించామని పేర్కొన్నారు.అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా మొదటి దశలో 10 వేల కేంద్రాలకు 100 కోట్ల రూపాయలతో మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. రెండో దశలో మిగతా కేంద్రాల అభివృద్ధిని పూర్తి చేస్తామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ..30.. సెకన్లు

-------------------------

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర--2026 కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్నాయి. ఏలూరు జిల్లాలోని నూజివీడు, ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడలో ఈరోజు నిర్వహించిన యోగా కార్యక్రమాల్లో అధికారులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మత్స్యగుండంలో జిల్లా కలెక్టర్ టి. నిశాంతి ఆధ్వర్యంలో ప్రత్యేక యోగా సాధన కార్యక్రమం నిర్వహించారు. ప్రకాశం జిల్లాలో కొత్తపట్నం మండలం కె.పల్లెపాలెం తీర ప్రాంతంలో సుమారు 700 మందితో యోగా సాధన నిర్వహించగా, పోలవరం జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ కార్మికులు, ప్రజలతో ప్రత్యేక యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.

-----------------------------

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా ఎంతో దోహదపడుతుందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యకమంలో మంత్రి ఈరోజు పాల్గొని ప్రజలతో కలిసి యోగాసనాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత జీవనశైలిలో యోగా అత్యంత అవసరమని దీని ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు క్రమశిక్షణ, ఏకాగ్రత కూడా పెంపొందుతాయని తెలిపారు. యోగా సాధనకు ప్రతిరోజూ కొంత సమయాన్ని కేటాయించాలని మంత్రి సూచిస్తూ,

వాయిస్…30 సెకన్లు

-----------------------------

నంద్యాల జిల్లాలోని శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి కుటుంబ సమేతంగా ఈరోజు దర్శించుకున్నారు. కేంద్రమంత్రికి దేవస్థానం ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు మహాద్వారం వద్ద సాదర స్వాగతం పలికారు. అనంతరం కిషన్ రెడ్డి దంపతులు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అర్చకులు వేద ఆశీర్వచనాలు అందించగా, దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలను కేంద్రమంత్రికి అందజేశారు.

-----------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 135వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు, లేదా మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు, లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈ నెల 26వ తేదీ వరకు పంపవచ్చు.

=====================